క్లుప్తంగా

క్రోసూరు పీహెచ్‌సీ వైద్యుడిగా రాంబాబునాయక్ బాధ్యతలు



క్రోసూరు: క్రోసూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడిగా డాక్టర్ వి.రాంబాబునాయక్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ రవి ఉత్తర్వులను పీహెచ్‌సీ అదనపు వైద్యురాలు డాక్టర్ సిరిచందనకు అందజేశారు. ఇప్పటి వరకు పనిచేసిన డాక్టర్ ధనుష్ తిరుపతి జిల్లా పిచ్చటూరు పీహెచ్‌సీకి బదిలీకాగా ఆయన స్థానంలో అచ్చంపేట మండలం మాదిపాడు పీహెచ్‌సీ నుంచి ఇక్కడ పీహెచ్‌సీ వైద్యుడిగా రాంబాబునాయక్ బాధ్యతలు తీసుకున్నారు. పీహెచ్‌సీకి ముగ్గురు వైద్యులుండగా ప్రస్తుతం ఒక వైద్యుడు డాక్టర్ సాద్ హజ్‌యాత్ర సెలవులో ఉండగా, ప్రస్తుతం ఇద్దరు వైద్యులు డాక్టర్ రాంబాబునాయక్, డాక్టర్ సిరిచందన ఉన్నారు.

ఘనంగా స్వప్రకాష్ గురూజీ ఆరాధన



సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల శ్రీసనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ నిర్మాణ, వ్యవస్థాపక ధర్మకర్త మాతాధిపతులు పూజ్య గురుదేవులు చింతాడ స్వప్రకాష్ గురూజీ ఆరాధన సోమవారం ఘనంగా నిర్వహించారు. గురూజీ శిష్యులు, వంశ పారంపర్య ట్రస్టీలు, భక్తులు గురూజీ విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. ఆశ్రమ ధర్మకర్త మాతాధిపతులు లలితాంబ మాతాజీ ఆధ్వర్యంలో వేద పాఠశాల విద్యార్థులు గురుపూజ నిర్వహించారు. మహామంత్ర పుష్పం, మంగళహారతి, మహానివేదన సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. బుధవారం బ్రహ్మంగారి ఆరాధన సందర్భంగా ఆశ్రమంలో లక్ష మల్లెలార్చన, ప్రత్యేక పూజలు జరుగుతాయని లలితాంబ మాతాజీ తెలిపారు.

పాకాలపాడు పీఏసీఎస్‌లో ఆధార్ ప్రత్యేక సవరణ



సత్తెనపల్లి: అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025లో భాగంగా పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా సహకార శాఖ అధికారి ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామం పీఏసీఎస్‌లో ఆధార్ ప్రత్యేక సవరణ ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. పర్సన్ ఇన్‌చార్జ్ ఎంవీ నరసయ్య ఆధార్ సవరణ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సెంటర్‌లో మొత్తం 11 మందికి ఆధార్ అప్‌డేట్ చేశారు. అడ్రస్ మార్పులు ఇద్దరికి, వయస్సు మార్పులు ఇద్దరికి, నూతనంగా ఇద్దరికి ఆధార్, ఐదుగురికి బయోమెట్రిక్ చేశారు. ఆధార్ సెంటర్‌ను సచివాలయం డీఏ కె.చలపతి రావు, సంఘ సీఈవో ఏ సాయిబాబు పర్యవేక్షించారు.

నేడు సర్వసభ్య సమావేశం

రాజుపాలెం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధ్యక్షతన మంగళవారం సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీవీ సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ముత్తు మారియమ్మన్ ఉత్సవాలు



సత్తెనపల్లి: మండల పరిధిలోని కంకణాలపల్లి శివారు గ్రామమైన వావిలాల్‌నగర్‌లో ముత్తు మారియమ్మన్ అమ్మవారి ఉత్సవాలు సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గడ్డివామిలో రాజుకున్న అగ్గి

యడ్లపాడు: స్థానిక మేదర వీధిలోని కొండ సాంబయ్యకు చెందిన వరిగడ్డి వామిలో సోమ వారం ఉదయం 10.30 సమయంలో దట్టమైన పొగలు రావడం స్థానికులు గమనించారు. సమీపంలోని ఓ ఇంటి పనులు చేసుకుంటున్న వారు అగ్గి రాజుకోవడం పసిగట్టి స్పందించారు. మోటర్‌తో నీళ్లు కొట్టగా, మరొకరు జేసీబీను తీసుకువచ్చి వామును పక్కకు నెట్టి మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. దగ్గరలో ఉన్న గేదెలను కట్లు విప్పి బయటకు పంపించేశారు. స్థానికుల సమయస్ఫూర్తి, ఆత్మస్థైర్యంతో పెనుప్రమాదం తప్పింది. అయితే ఇది ఆకతాయిల నిర్వాకమేనని స్థానికులు అనుమానవ్యక్తం చేస్తున్నారు.

కంకర పోశారు.. ఆపై మరిచారు

- బాలాజీనగరంతండా రోడ్డుకు వీడని గ్రహణం
- ఆశగా ఎదురుచూస్తున్న తండా వాసులు

నకరికల్లు: మండలంలోని బాలాజీనగర్‌తండా రోడ్డుకు గ్రహణం వీడడం లేదు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు అధ్వానంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తండావాసులకు అవస్థలు తప్పడం లేదు. నకరికల్లు-మాచర్ల రహదారిలో నర్సింగపాడు గ్రామం నుంచి బాలాజీనగర్‌తండా ఉంటుంది. ప్రధాన రహదారి నుంచి సుమారు 2 కిలోమీటర్ల మేర లోపలకి తండా ఉంటుంది. తండాలో 1,200 మంది వరకు జనాభా ఉంటుంది. గ్రామ ప్రజలంతా బంజారాతెగకు చెందినవారు. నిత్యం నర్సింగపాడు గ్రామం, అలాగే నకరికల్లుకు రాకపోకలు సాగించాలంటే సుమారు 2 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డుగుండా ప్రయాణం చేసి ప్రధాన రహదారికి చేరుకోవాలి. కాగా గత కొన్నేళ్లుగా రోడ్డు అధ్వానంగా మారి ప్రయాణానికి ప్రతికూలంగా మారింది.

రోడ్డు నిర్మాణం కోసం ఎదురుచూపులు

గత ప్రభుత్వ హయాంలో రూ.32 లక్షల నిధులు మంజూరు కాగా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులా మార్జిన్ పనులు చేపట్టారు. తరువాత వెట్‌మిక్స్ వేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. దానిపై అధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తికాకముందే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించలేదు. దీంతో రోడ్డుపై రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదానికి గురవుతున్నాయి. పలుమార్లు ఉన్నతాధికారులకు తండావాసులు విన్నవించినా ఫలితం లేకపోయింది. గత ఏడాది కాలంగా రోడ్డు నిర్మాణం కోసం ఎదురుచూడడం తండావాసుల పనైంది.



రోడ్డు తొలుస్తున్న జేసీబీ (ఫైల్)



నర్సింగపాడు గ్రామం నుంచి బాలాజీనగర్‌తండా వెళ్లే రోడ్డు దుస్థితి

నడవాలన్నా కష్టంగా మారింది



మా తండాకు వచ్చే రోడ్డుపై నడవాలన్నా కష్టంగా మారింది. కొత్తగా రోడ్డు వేస్తామని చెప్పి ప్రొక్‌లెయినర్‌తో పనులు చేశారు. రోడ్డుపై కంకర రాళ్లు పోశారు. ఇప్పటివరకు మళ్లీ రోడ్డు గురించే పట్టించుకోలేదు. రోడ్డంతా రాళ్లమయమైంది. నడవాలన్నా కష్టంగా ఉంది. నర్సింగపాడు నుంచి రావాలంటే నడిచి వస్తుంటే రాళ్లధాటికి నడవలేక పోతున్నాం. బైక్ మీద వస్తున్నా అవస్థలు తప్పడం లేదు.

– వాంకడావత్ సాలిబాయి, బాలాజీనగర్‌తండా

ఎప్పటికి బాగు పడుతుందో



రోడ్డు మరమ్మతులు చేస్తారని ఎదురుచూడడం మా వంతుగా మారింది. కొత్తగా తారురోడ్డు పోస్తామన్నారు. మా ప్రయాణకష్టాలు తీరతాయని ఆశపడ్డాం. రోడ్డు పనులు చేపడతామని కంకర పోశారు. ఇక మిగతా పనులు చేపట్టకుండా వదిలేశారు. మా తండావాసులు కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఎప్పటికీ మా రోడ్డు బాగుపడుతుందో తెలియడం లేదు.

– వి.సామ్రాజ్యంబాయి, బాలాజీనగర్‌తండా

ప్రతిపాదనలు పంపాం

నకరికల్లు మండలంలోని బాలాజీనగర్ తండాకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు అనుమతుల కోసం ప్రపోజల్స్ పంపాం. నర్సింగపాడు రోడ్డు నుంచి తండా వరకు 1.6 కిలోమీటర్ల రోడ్డుకు రూ.75 లక్షలకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు ఇంకా రాకపోవడంతో పనులు ప్రారంభించలేకపోయాం.

– సాయికిరణ్, పీఐయూ, సబ్‌డివిజన్, సత్తెనపల్లి

ప్రతిభ పురస్కారానికి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని



నాగూర్ బీ

పెదకూరపాడు : మండలంలోని 75 త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ నాగూర్ బీ గ్రామీణ ప్రాంత పదవ తరగతి ఫలితాల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచనందుకు విద్యార్థి వికాస వాహిని (వి.వి.వి) సంస్థ ఇచ్చే ప్రతిభ పురస్కారానికి ఎంపికైంది. ఈ పురస్కారాన్ని విశ్వకవి రవీంద్రుని జయంతి రోజైన ఈ నెల 7న విజయవాడలోని రామమోహన గ్రంథాలయంలో జరిగే కార్యక్రమంలో అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ జి.వి.పూర్ణచందు, విద్యార్థి వికాస వాహిని సంస్థకి చెందిన వేములపల్లి కేశవరావు, మర్రి శ్రావణి తదితరులు పాల్గొని విద్యార్థులకు పురస్కారాలను అందజేస్తారు. జి.రామరత్నం చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఈ మెరిటోరియస్ అవార్డులను విద్యార్థి వికాస వాహిని సంస్థ అందజేస్తుంది. ఈ పురస్కారానికి ఎంపికైన నాగూర్‌బీని ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు, పీఏసీ చైర్మన్ జి.పున్నారావు, గ్రామ పెద్దలు అభినందించారు.

భారీ స్కాంకు తెరలేపిన చంద్రబాబు ప్రభుత్వం

- బీసీలకు కుట్టుమిషన్‌ల పంపిణీ, ట్రైనింగ్ పేరుతో స్కాం
- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర మాజీ సెక్రటరీ రాజవరపు



మాట్లాడుతున్న రాజవరపు శివనాగేశ్వరరావు, పక్కన బీసీ సంఘ నాయకులు

సత్తెనపల్లి: బీసీలకు కుట్టు మిషన్ల పంపిణీ, శిక్షణ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం రూ.245 కోట్ల భారీ స్కాంకు తెరలేపిందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర మాజీ సెక్రటరీ, సీనియర్ న్యాయవాది రాజవరపు శివ నాగేశ్వరరావు అన్నారు. సత్తెనపల్లిలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుట్టుమిషన్ల పేరుతో మహిళలను మోసం చేస్తుందన్నారు. లక్ష మంది మహిళలకు కుట్టు మిషన్లు శిక్షణ ఇచ్చుటకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్ కింద రూ.230 కోట్లు చూపిందన్నారు. ఒక్కో లబ్ధిదారుకు కుట్టు మిషన్ కొనుగోలుకు రూ.4,300, శిక్షణ నిమిత్తం రూ.3 వేలు, మొత్తం రూ.7,300 అవుతుందన్నారు. కేటాయింపు రూ.23 వేలుగా చూపించి ఈ ప్రభుత్వం రూ.157 కోట్ల స్కామ్ చేసిందని ఆరోపించారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు తాను అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తానని చెప్పి ఈ విధంగా బీసీ మహిళల సొమ్మును కాజేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఎప్పుడు ఇస్తారో చెప్పకుండా ఈ విధంగా ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. మోసపు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక దోచుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి సరైన సమయంలో సరైన రీతిలో ప్రజలు ముఖ్యంగా బీసీలు బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో ఒకటవ వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు పెద్దింటి వెంకటేశ్వర్లు (చిట్టి), లోకా మాధవ, సంకుల తిరుములరావు, బొమ్మనబోయిన శ్రీనివాసరావు యాదవ్ ఉన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



పారితోషికాలు అందుకున్న టెన్త్ ప్రతిభావతులతో పెన్షనర్లు, ఉపాధ్యాయులు

సత్తెనపల్లి: విద్యార్థినులు చిన్న తనం నుంచి క్రమశిక్షణతో విద్యనభ్యశించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన బాలికోన్నత పాఠశాలకు చెందిన సుమారు 20 మంది బాలికలకు నగదు పారితోషికంతో పాటు మెడల్స్ సోమవారం అందించారు. ఈ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ చిన్న తనం నుంచే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత మాట్లాడుతూ మీరు పొందిన బహుమతులు మీ జీవితాలలో స్ఫూర్తి దాయకం కావాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత, తెలుగు పండిట్ శివపార్వతులను సత్కరించారు. ప్రతిభావంతులకు బాదుగున్నల కమలాకర్ రావు స్పాన్సర్ చేసిన పారితోషికాలు, మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా వేసవిని పురస్కరించుకొని అందరికీ శీతల పానీయాలను పెన్షనర్ లియోరాజు స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ జెట్టి సైదులు, పొత్తూరి రామకోటయ్య, జగన్నాదనాయుడు, జయనుల్లా, నాసరయ్య, నరసింహారావు, సుబ్బారావు, కమలాకరరావు, సూర్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో పలు అభివృద్ధి పనులను సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ప్రారంభించారు. గ్రామంలో రూ.21.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కాశయ్య, ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

యువకుడిపై గుర్తు తెలియని దుండగులు దాడి

సత్తెనపల్లి: ప్రైవేట్ ఉద్యోగిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసిన ఘటన పల్నాడు సత్తెనపల్లిలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సుందరయ్య కాలనీకి చెందిన యువకుడు పోకూరి మణికంఠ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ వర్క్ ఫ్రమ్ హోంలో ఉన్నాడు. కంపెనీ పని నిమిత్తం హైదరాబాదు వెళ్లేందుకు బట్టల బ్యాగు, ల్యాప్‌టాప్ తీసుకొని రైల్వేస్టేషన్‌కు నడుచుకుంటూ వెళుతున్నాడు. రైల్వేస్టేషన్‌రోడ్‌లోని సచివాలయం సమీపంలో ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన నలుగురు గుర్తుతెలియని దుండగులు దాడి చేసి ల్యాప్‌టాప్, బట్టలు బ్యాగును అపహరించుకుపోయారు. దీంతో లబోదిబో మంటూ మణికంఠ పట్టణ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజీల ఆధారంగా దాడి చేసిన దుండగులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. పట్టపగలు యువకుడిపై జరిగిన ఈ దాడి ఘటన పట్టణంలో చర్చనీయాంశమైంది.

ప్రకృతి వ్యవసాయ పంటలు ఆరోగ్యకరం



రాజుపాలెం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు తినడం వలన ఆరోగ్యంగా ఉంటారని ఎంఈవో-1 మల్లిఖార్జునశర్మ తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రకృతి వ్యసాయ ద్వారా పండించిన కూరగాయల స్టాల్స్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. కొనుగోలుదారులు ఆకుకూరలు, కూరగాయలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 నరసింహారావు, ఏపీఎం శివకుమార్, ప్రకృతి వ్యవసాయ నిర్వాహకులు దండే కోటేశ్వరరావు, వెంకటరమణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన



శిక్షణ కార్యక్రమంలో యువత

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి జి.తమ్మాజీరావు సోమవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు అందచేయాలన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులు, పదవతరగతి పైన చదువుకుని, 15 నుంచి 45 సంవత్సరాల వయసు గల వారు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు బాపతు అంజిరెడ్డి 7779858789ని సంప్రదించవచ్చన్నారు. కోర్స్ కాల వ్యవధి 2 నెలలుగా తెలిపారు. ట్రైనింగ్ పూర్తి అయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించబడునని చెప్పారు.

పశువుల ఎరువు అభివృద్ధిపై అవగాహన



పశువుల ఎరువు అభివృద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ కృషి అనుభవం కార్యక్రమంలో భాగంగా ట్రైకోడెర్మావిరిడీ, ఫ్లూడోమోనాస్ ఫ్లోరెసెన్స్‌తో పశువుల ఎరువు అభివృద్ధిపై సోమవారం ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పశువుల ఎరువును జీవ సూత్రజీవులతో అభివృద్ధి చేయడం వలన కలిగే లాభాలను రైతులకు వివరించారు. ట్రైకోడెర్మావిరిడీ మట్టిలో ఉన్న శిలీంధ్రజన్య వ్యాధులను నియంత్రించడంలో సహాయపడుతుందని, ఫ్లూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ హానికర జీవులను నిరోధించి మొక్కల అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, విద్యార్థినులు టి.రేణుక, జె.సుమలి, కె.వి.కృష్ణవేణి, బి.వర్షిణీస్వరాజ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



నూజెండ్ల: శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన రేపు ఘనంగా నిర్వహించనున్నారు. మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన స్వామి వారి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. గ్రామ వాస్తవ్యులు యెల్లేపల్లి వెంకట సుబ్రమణ్యశాస్త్రి స్థలం అందించగా చందాల రూపంలో వచ్చిన 60 లక్షల నిదులతో గ్రామస్తులు ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. స్వామి వారి అరాధనలో చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కమిటీ పెద్దలు కోరారు.

కూరగాయల వ్యాపారిపై దాడి

టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు

నరసరావుపేట టౌన్: కూరగాయల వ్యాపారిపై కొందరు యువకులు దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బాబాపేట వద్ద గల హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో ఇంటూరి నాగేశ్వరరావు కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. నాగేశ్వరరావు దుకాణం పక్కనే తోట సురేష్‌కు కూరగాయల దుకాణం ఉంది. అతని దుకాణానికి సరుకు దించేందుకు వచ్చిన లారీ సురేష్ దుకాణం ఎదుట నిలిపారు. దీంతో సురేష్ వాగ్వివాదానికి దిగి అతని స్నేహితులు ఆర్.పి. వాసు, సుబ్బారావు మరి కొందరితో కలిసి నాగేశ్వరరావుపై దాడికి పాల్పడ్డారు. అనంతరం నాగేశ్వరరావు దుకాణానికి తాళాలు వేసి దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు సోమవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై సీఐ హైమారావును వివరణ కోరగా కూరగాయల వ్యాపారం నిర్వహణలో గొడవ జరిగిందని ఫిర్యాదు అందిందన్నారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాలికల భవితకు కిశోరి వికాసం

- నెలరోజులపాటు అవగాహన కార్యక్రమాలు
- ఆరోగ్య పరిరక్షణ, సామాజిక అంశాలు, చట్టాలపై చైతన్యవంతం
- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా రూపకల్పన



కిశోరి వికాసంపై బాలికల పరిచయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు

సత్తెనపల్లి: సమాజంలో కౌమార దశకు చేరుతున్న బాలికలు ఆరోగ్య సమస్యలు, ఇతర ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కిశోరి వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మహిళా శిశు సంక్షేమ శాఖ వేసవి సెలవుల్లో కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టింది. బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఇతర శాఖలను సమన్వయం చేసుకొని సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించింది. ఈ నెల 2 నుంచి జూన్ 10 వరకు ఈ కార్యక్రమాలను చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డీఆర్డీఏ, వీఆర్ఏ, ఎంపీహెచ్‌డబ్ల్యూ తదితరులతో కూడిన బృందాలు గ్రామాల్లో కిశోర బాలికలకు ఆరోగ్యం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మరక్షణ, బాల్యవివాహాలు తదితర విషయాలపై అవగాహన కల్పించనున్నాయి.

షెడ్యూల్ ఇలా...

ఈ నెల 2న బాలికల పరిచయం, 6న రుతుక్రమ పరిశుభ్రత, లైంగిక విద్య, 9న బాల్య వివాహాలు, పునరుత్పత్తి, ఆరోగ్యంపై ప్రభావాలు, 13న పిల్లల హక్కులు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, పోక్సో చట్టం, 16న కౌమార దశలో రక్తహీనత, 20న లింగ అసమానత, ఆడపిల్లలపై వివక్ష, 23న విద్య, కెరీర్‌పై సూచనలు, నైపుణ్య ప్రాముఖ్యత, 27న సైబర్ రక్షణ, ఆన్‌లైన్‌లో భద్రత, సమస్యలు, 30న ఆర్థిక అంశాల నిర్వహణ, జూన్ 3న బాలికల నాయకత్వ లక్షణాలు, సాధికారత, జూన్ 6న క్రీడలు, యోగ, వ్యాయామం, జూన్ 10న బాల్య వివాహాల నిర్మూలన దితర అంశాలపై అవగాహన కల్పిస్తారు.

- జిల్లాలో 14 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలు, అలాగే బడి మానేసిన 11 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి వారిని గ్రూపులుగా విభజిస్తారు. వారికి ఎంపిక చేసిన అంశాలపై ఆయా ప్రాంతాల్లో బాలికలకు అనువైన సమయంలో గంటపాటు శిక్షణ ఇస్తారు.
- కిశోరి వికాసం కోసం గ్రామ/వార్డు స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా ఐదుగురితో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. అందులో అంగన్‌వాడీ కార్యకర్త, బహుళార్ధ సాధక ఆరోగ్య కార్యకర్త, గుర్తింపు పొందిన ఆరోగ్య కార్యకర్త, సచివాలయ ఆర్గనైజింగ్ అసిస్టెంట్ ముఖ్యపాత్ర పోషిస్తారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడేనా?

గ్రామీణ ప్రాంతాల్లో వేసవి సెలవుల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఎవరైనా సమాచారం అందిస్తే తప్ప అడ్డుకోవడం మినహా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో నిఘా ఉంచలేకపోతోంది. బాలికలను చైతన్య వంతం చేయడం ద్వారా అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. బాల్య వివాహాలను ఎక్కువగా 15 నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలకు చేస్తున్నారు. వాటి నిర్మూలనకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు. ఏ ప్రాంతంలో అయినా బాల్య వివాహాలు చేస్తున్నా, ప్రోత్సహిస్తున్నా టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫిర్యాదు చేయవచ్చు.

వేసవిలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



మాట్లాడుతున్న అమలకుమారి

నరసరావుపేట రూరల్: వేసవిలో పంట భూములు బీడుగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో సోమవారం రైతు శాస్త్రవేత్తల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ రైతు శాస్త్రవేత్తల నాలుగు సంవత్సరాల శిక్షణ కార్యక్రమంలో భాగంగా సెమిస్టర్ 2, 4 విద్యార్థులకు తరగతులు నిర్వహించినట్టు తెలిపారు. వేసవిలో పొలాలు ఖాళీగా ఉంచకుండా 30రకాల విత్తనాలతో కూడిన ప్రీ మాన్ సూన్ డ్రై సోయింగ్ విధానాన్ని పాటించాలని తెలిపారు. తోటలు ఇతర పంటలలో ఎల్ ఆకారపు కట్టలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీపీ కిరణ్మయి, డీపీపీ భవానిరాజు, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

20న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

నరసరావుపేట: స్వాతంత్రం కంటే ముందే పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను కాల రాసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని, వాటి రద్దు కోసం దేశ కార్మిక వర్గం మొత్తం ఉద్యమించాలని సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయునాయక్ పిలుపునిచ్చారు. సోమవారం కోటప్పకొండ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదానికై వివిధ సంఘాల నాయకులతో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ సమ్మెకు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు భారతదేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం అవుతున్నారని తెలిపారు. సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్, అధ్యక్షులు కె.హనుమంత రెడ్డి, రైతు సంఘ జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి రవిబాబు, కౌలు రైతు సంఘ పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లీశ్వరి, పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.